నూనె ధరలు సల సల



ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటికి తోడు వంట నూనెలు కూడా ఆకాశాన్నంటుతుండటంతో పేదవాళ్లు నాలుగు మెతుకులు తినలేని పరిస్థితి నెలకొంది. ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందంటూ సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పామాయిల్ కిలో రూ.140.. సన్‌ఫ్లవర్ రూ.150
- ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలం
- ఇబ్బందులు పడుతున్నామంటున్న సామాన్యులు

గుడిబండ: వంట నూనెలు సలసల కాగుతున్నాయి. రోజు రోజుకూ ధరలు ఎగబాకుతున్నాయి. వినియోగదారులు అధికంగా ఉపయోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ వంట నూనెల ధరలు మండిపోతున్నాయి. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 2 లక్షలకు పైగా జనాభా ఉంది. 60 వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబానికి నెలకు రెండు నుంచి మూడు లీటర్ల వంట నూనె అవసరం. వీరితో పాటు నూనె ఆధారంగా తినుబండారాలు తయారు చేసి అమ్మకాలు చేపడుతున్నా వారితో కలిపి సగటున నియోజకవర్గంలో నెలకు లక్ష నుంచి రెండు లక్షల లీటర్ల నూనె వాడకం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. సామాన్యులకు అందనంత ఎత్తులో వంట నూనెల ధరలు ఉండటంతో వినియోగదారులు హడలిపోతున్నారు. ఓ వైపు వంట నూనె ధరలు మండిపోతంటే మరోవైపు కూరగాయల ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. మార్కెట్‌కు వెళ్లే ప్రతి వినియోగదారుడి జేబుకు చిల్లులు పడుతున్నాయి. వంట నూనెలపై దిగుమతి సుంకాలు 20 శాతానికి పెంచడంతో వాటి ధరలు సామాన్యుడికి అందకుండా పోతున్నాయని పేద, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు.

నాలుగు నెలల్లో పైపైకి..

తాము అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఏమైపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలా ధరలు మండిపోతున్నాయని విమర్శిస్తున్నారు. వంట నూనెల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచడంతో లీటరుకు దాదాపు రూ 50 వరకు పెరిగిందని ధ్వజమెత్తుతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశలున్నాయిని వ్యాపారులు చెబుతుండడంతో ప్రజలు మరింత నిరాశకు గురవుతున్నారు.

వంట నూనెల ధరలు ఇలా..		
నూనె పేరు	3 నెలల క్రితం ధర	ప్రస్తుత ధర
పామాయిల్	రూ.95	రూ.140
సన్‌ఫ్లవర్	రూ.115	రూ.150
వేరుశనగ	రూ.180	రూ.230
రైస్‌బ్రాండ్	రూ.150	రూ.190

సబ్సిడీ ఊసేదీ?

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి వంట నూనెలకు గతంలో బేసిక్ కస్టమ్స్ సుంకాలు ఉండేవి కావు. ప్రస్తుతం వాటిపై కేంద్రం 20 శాతం సుంకాన్ని విధించింది. శుద్ధి చేసిన వంట నూనెలపై 12.5 శాతం ఉన్న సుంకాన్ని 30.5 శాతానికి పెంచేసింది. దీంతో లీటరుపై రూ. 35 నుంచి 50 వరకూ ధరలు పెరిగాయి. గతంలో వంటనూనె, కంది పప్పు ధరలు పెరిగినప్పుడు చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వాలు సరఫరా చేసివి. వంటనూనెలు, నిత్యావసర సరుకులు ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఏం కొనలేం .. ఏం తినలేం



మార్కెట్లో పెరిగిన అన్నిరకాల నిత్యావసరాలు, కూరగాయలు ధరల తగ్గింపునకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. రూ.500లు మార్కెట్‌కు తీసుకెళ్తే 5 రాకల వస్తువులు రావడంలేదు. పేద, మధ్యతరగతి ప్రజలు పెరిగిన వంట నూనె ధరలతో కుటుంబ సభ్యులకు ఇష్టమైన వంటకాలు కూడా సంతృప్తిగా వండి వడ్డించలేకపోతున్నాము.

– విమలాక్షమ్మ, గుడిబండ

ఇంతలా పెరిగితే ఎలా?



నిత్యావసర సరుకుల ధరలు ఇంతలా గతంలో పెరగడం ఎన్నడూ చూడలేదు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సంతృప్తిగా భోజనం చేయాలన్నా లెక్కలేసుకోవాల్సి వస్తోంది. వంట నూనె, కూరగాయలు ధరలు కొనాలంటే ఆలోచించాల్సిన రోజులు వచ్చేశాయి.

– నవీన్‌కుమార్, ఫళారం, గుడిబండ

ప్రభుత్వం కళ్లు తెరిచే వరకూ పోరాటం

- 13న పుట్టపర్తిలో నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిరలో రైతు ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తున్న ఈరలక్కప్ప

అగళి: రైతుల సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఈనెల 13న పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. మండల పరిధిలోని మధూడిలోని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి నివాసంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప సమావేశమయ్యారు. ఆయన మట్లాడుతూ.. 13న నిర్వహించనున్న ర్యాలీని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అంతకు ముందు మాజీ డీలర్ తిప్పేస్వామి మనవడి నామకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, సర్పంచ్ శివకుమార్, నాయకుడు, చంద్రప్ప, సదానంద ఆరాధ్య, మండలపల్లి అశ్వత్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

మడకశిర: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించేవరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలో ఈనెల 13న నిర్వహించే రైతు ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. పుట్టపర్తిలో ఉదయం 10 గంటలకు రైతు సమస్యలపై పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీపీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

అమరాపురం: పుట్టపర్తిలో ఈనెల 13న నిర్వహించతలపెట్టిన ర్యాలీని మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క తెలిపారు. ఉదయం 10 గంటలకు పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం చేరుకోవాలన్నారు.

గుడిబండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధానాలతో నష్టపోతున్న రైతులు, ప్రజలకు బాసటగా నిలిచేందుకు ఈనెల 13న పుట్టపర్తిలో నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ర్యాలీని విజయవతం చేయాలని కోరారు.

రొళ్ల: రైతు సమస్యల పరిష్కారానికై ఈనెల 13న జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

14న సాగునీటి సంఘం ఎన్నికలు

పరిగి: మండలంలోని అన్ని సాగునీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు హసీనా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా శనివారం ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన సాగు నీటి వినియోగదారులు పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బి, అడంగల్‌తో హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల అభివృద్ధి తయారీ ప్రణాళికపై బుధవారం ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రామరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఏఏ అభివృద్ధి పనులు కావాలి, ప్రజలకు అవసరమైన వాటిని ఏవిధంగా తయారు చేయాలి, ఏఏ అంశాలపై ప్రణాళిక తయారు చేయాలి అనే దానిపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి



హిందూపురం: పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేస్తున్న జర్నలిస్టులు

హిందూపురం టౌన్: హైదరాబాద్‌లో జర్నలిస్టుపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలంటూ హిందూపురం జర్నలిస్టులు డిమాండ్ చేశారు. బుధవారం హిందూపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లేపాక్షి: జర్నలిస్టుపై సినీనటుడు మోహన్‌బాబు విచక్షణ కోల్పోయి దాడిచేయడం హేయమని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుపై దాడికి నిరసనగా లేపాక్షి మండల జర్నలిస్టులు స్థానిక ఎస్‌ఐ నరేంద్రకు బుధవారం వినతిపత్రం అందించారు. మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలని కోరారు.

పరిగి: హైదరాబాద్‌లో జర్నలిస్టుపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని మండల జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ రంగడుయాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సోమందేపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, మండల అధ్యక్షుడు సమీవుల్లా, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం అలవాటు చేసుకోవాలి



ఆచార్య శివస్వామి

హిందూపురం టౌన్: ప్రతి ఒక్కరూ పవిత్రమైన భగవద్గీత పఠనం అలవాటు చేసుకోవాలని ఆది శంకర గురు పరంపర ఆచార్య శివస్వామి అన్నారు. బుధవారం గీతా జయంతిని పురస్కరించుకుని సత్యనారాయణపేటలోని శ్రీశేషసాయి సంస్థాన్‌లో భగవద్గీత భక్తి షట్కం పారాయణ, గీతా సత్సంగంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య శివస్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు మానవ జాతికి అమూల్యమైన భగవద్గీతను బోధించిన రోజును మనం గీతా జయంతిగా జరుపుకుంటామన్నారు. ఎంతటి దుర్మార్గుడినైనా మంచి మనిషిగా, మహాత్ముడిగా తీర్చిదిద్దే శక్తి భగవద్గీతకు ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేష్, దేవాంగం శంకరప్ప, ఏలూరు రమేష్, రవి ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, అంజన రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండానే కేబుల్ పనులు



పనులను ఆపివేయిస్తున్న ఏఈఈ అనిల్

పావగడ: సంబంధిత శాఖల అనుమతి తీసుకోకుండా దూరవాణికి సంబంధించిన ఓఎఫ్‌సీ కేబుల్ పూడ్చడానికి ఓ ప్రైవేట్ కంపెనీ రోడ్డు పక్కనే మట్టి తవ్వకాల పనులను చేపట్టింది. రోడ్లను ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాలూకాలోని కడమలకుంట గ్రామం ప్రధాన రోడ్డు పక్కన జేసీబీతో చేస్తున్న పనులను స్థానిక పీడబ్ల్యూడీ ఏఈఈ అనిల్‌కుమార్ ఆపించారు. అనంతరం పోలీసులు వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఏఈఈ అనిల్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి



కార్మికుల సమ్మెకు సంఘీభావంగా మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం టౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న నీటి సరఫరా, లైటింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ చైర్మన్ జబీవుల్లా సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిల్‌లో చర్చించి, వాటికి కౌన్సిల్లో ఆమోదం తెలిపి మున్సిపల్ ఉన్నతాధికారులకు వివరిస్తామని కార్మికులకు భరోసా ఇచ్చారు. కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేయడం వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమ్మె విరమించాలనికోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాబాఫకృద్దీన్, రఘు, కోటేశ్వర్, బాబా, కగ్గప్ప, అంజి, క్రిష్ణ, శీన, జనార్ధన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం తహసీల్దార్ కరుణాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. రైతులు భూ సమస్యలను వివరించి అర్జీలను అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రొద్దం: రైతుల సమస్యలు పరిష్కారం చేయడానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నాగేంద్ర అన్నారు. బుధవారం మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో రచ్చబండ వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ పరిధిలో నెలకొన్న రైతుల సమస్యలపై పలువురు వినతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన

మడకశిరరూరల్: మండల పరిధిలోని జక్కేపల్లి గ్రామంలో బుధవారం హిందూపురానికి చెందిన హెరిటేజ్‌ఫుడ్ లిమిటెడ్ ప్రతినిధులు పాడి రైతులకు అవగాహన, ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుల పెంపకం, మేత పద్ధతుల్లో పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. డాక్టర్ వేణుయాదవ్ పశువులకు పశు వైద్య చికిత్సలు నిర్వహించారు.

క్లుప్తంగా

మధ్యంతర భృతిని ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

హిందూపురం టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏలు, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న డీఏలను, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్ల కొరత అధికంగా ఉందని, వెంటనే సబ్జెక్ట్ టీచర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఆర్థిక కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందాచారి కుమారుడు, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు యువరాజు వివాహ వేడుకలు మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, మాజీ వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, సర్పంచ్ కరుణాకర్‌గౌడు పాల్గొన్నారు.

చార్జీల పెంపును ఉపసంహరించుకోండి



ట్రాన్స్‌కో ఏడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం ట్రాన్స్‌కో ఏడీ శేషగిరికి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ నిత్యావసర ధరలతో ఇప్పటికే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనంగా ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్టు మీటర్లు అమలును ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం హరి, సీఐటీయూ రమేష్, కాంగ్రెస్ పార్టీ నిస్సార్, వ్యసాయ కార్మిక సంఘం నేత గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపిక



రవీంద్రనాథ్‌ఠాగూర్

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి రవీంద్రనాథ్‌ఠాగూర్ ఈనెల 6న ఆన్‌లైన్ జరిగిన కౌశల్ ప్రతిభాన్వేషణ పరీక్షల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్‌ఠాగూర్‌ను అభినందించారు.

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం



గ్రీన్ అంబాసిడర్లను సన్మానించిన దృశ్యం

అమరాపురం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీన్ అంబాసిడర్‌లను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుధాకర్, మండల కోఆర్డినేటర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ఉత్సవాల సందర్భంగా అమరాపురం పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ వర్కర్లు మరుగు కాలువలు, వీధులను శుభ్రం చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సుస్థిరాభివృద్ధికి కృషి



శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ శ్రీధర్

పరిగి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ సుస్థిర అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండ్రోజుల పాటూ జరిగే కార్యక్రమంలో బాగంగా తొలి రోజు ఎంపీడీఓ శ్రీధర్ అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వం తరవున గ్రామాల్లో అన్ని శాఖల అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులపై టీఓటీలు సుదీర్ఘంగా వివరించారు. ప్రధానంగా గ్రామ పంచాయతీ సమగ్రాభివృద్ధి, సాధించాల్సిన లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, టీఓటీలు వన్నప్ప, ప్రత్యూష, నాగన్న, రామేశ్వర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

మడకశిర: పట్టణంలో బుధవారం గీతా జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిర్డి సాయిబాబా, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేడుకలు జరిగాయి. కృష్ణ భగవాన్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు సామూహిక గీతాపారాయణం చేశారు. భవద్గీత పుస్తకాన్ని పఠనం చేశారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ

హిందూపురం టౌన్: పట్టణ పరిధిలోని కొట్నూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు వరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడి పూజా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటాలను అలంకరించి, 18 మెట్లను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున అయ్యప్ప మాలధారులు పాల్గొని ప్రత్యేకంగా భజనలు నిర్వహించారు. అయ్యప్ప శరణఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు మోతుకుపల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బెంగళూరు రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, న్యాతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శబరీష్‌రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక వికాసం ముఖ్యం



విజేతలకు భగవద్గీత, ప్రశంసాపత్రాలు అందించిన ప్రిన్సిపాల్, ఇస్కాన్ ప్రతినిధులు

పరిగి: విద్యార్థులకు మానసిక వికాసం, ఉచ్చారణ శక్తి, ఏకాగ్రత, మనోధైర్యం చాలా ముఖ్యమని ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లి ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. పాఠశాలలో బుధవారం గీత జయంతి వేడుకలను ఇస్కాన్ (ఐవైఎఫ్) బృందావన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ చిన్నప్పటి నుండే విజ్ఞానం పెంపొందించుకోవడానికి కొన్ని ప్రత్యేకమైన అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. రాధకాంత, గోవిందదాస్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్త పఠన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

పరిగి: మండల కేంద్రం నుంచి బుధవారం తిరుమలకు పాదయాత్ర బృందం బయలుదేరింది. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి 15 మంది భక్తులు పాదయాత్రకు తిరుమలకు బయలు దేరారు. ఈనెల 17న తిరుమలకు చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకుంటామని వారు తెలిపారు. కాగా తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్త బృందానికి పరిగి సర్పంచ్ లక్ష్మీదేవిచే ఆమె భర్త శివశంకర్ మినరల్ వాటర్ బాటిళ్లు, అరటి పళ్లు, బిస్కెట్లను అందించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, డీఎస్ఎల్ శ్రీనివాసులు, శివశంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

హిందూపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందివ్వాలని ఎంఈఓ గంగప్ప ఆదేశించారు. బుధవారం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.